# 7. సెపరేషన్ జిందాబాద్

కాలేజీ ఆవరణలోకి అడుగు పెట్టేసరికి, నాకోసం కొండంత ఆశ్చర్యం కాచుకూర్చుంది. కాలేజీ విద్యార్థులంతా ఆ గోడలచుట్టూ చేరి తమ కొచ్చిన అక్షర పరిజ్ఞానాన్ని సార్థకం చేసుకుంటున్నారు. మనిషిగా నాలోనూ ఆ క్షణంలో కుతూహలం కలిగింది. శారీరకంగా కదలక పోయినా, చక్షువులను ఆ గోడలకేసి పంపించాను. ఆ గోడలమీద రాతలు నా కొచ్చిన చదువును వెక్కిరిస్తూ కనబడ్డాయి. చదువుకో గలిగి నందుకు యింతకాలం నా మనసంతా ఉప్పొంగిపోయేది. గర్వంతో మన సంతా పులకించి పోయేది. కానీ ఈనాడు....ఈనాడు ఆ అక్షరాలు చదవ గలిగినందుకూ, నాకు ఆమాత్రం చదువు అబ్బినందుకూ నా దౌర్భాగ్యానికి కించ పడ్డాను.

ఆ గోడల మీద మనిషిలోని మనసు స్పష్టంగా నాట్యమాడు తోంది.

మనిషి మనసెంతటి దౌర్బల్యానికి పాలు పడిపోతుందో ఆ గోడల మీద రాతలు స్పష్టంగా చెబుతున్నాయి.

మనిషి ఎంత చదువుకొన్నా మనసెంతగా కుంచించుకు పోగలదో ఆ రాతలు తెలియజేస్తున్నాయి.

మనసు తనమీదున్న ముసుగుల నన్నిటినీ ఆ క్షణంలో విడిచేసి గోడలమీద నగ్నంగా నిలబడి వుంది.

ఆ అక్షరాలను మరోసారి చదువుకొన్నాను – సగానికి పైగా బూతులు. మిగతా సగానికి అర్థంలేదు. అయినా విషయ మంతా

తెలిసిపోతోంది. క్షణంసేపు సిగ్గుతో చచ్చిపోయాను. ఆ తర్వాత ఈ లోకంలో వచ్చిపడ్డాను — వెంటనే అటుకేసి కదిలాను. అక్కడున్న విద్యార్థులను నెమ్మదిగా మందలించాను.

'ఏమిటి రాజా ఇది!' అనడిగాను.

ఆ అబ్బాయి—రాజు—నాకేసి చూసి ఆశ్చర్యపోయాడు. వెంటనే తేరుకొంటూ అన్నాడు— 'యిక్కడ ...అదే గోడలమీద... యింకేమీ అనలేకపోయాడు.

'. సరేలే, వీళ్ళందర్నీ వెళ్ళమను. చూడు ఎంత అసహ్యంగా వుందో? ఆ చదువుకొన్నందుకు సార్థకత వుండాలి;' కొంచెం ఆవేశంగా అన్నాను.

'చదువుకొన్నవాళ్లు రాసి వుండరండీ!' అన్నాడెవరో ఆ గుంపులోంచి.

నాకు నవ్వొచ్చింది—'నిజమే, చదువుకొన్నవాళ్లు రాసి వుండరు! అక్షరాలు తెలిసీ చదువుకోనివాళ్ళుంటారుగా, వాళ్ల పనే యిది! సరే లెండి, పదండి!' అన్నాను.

నెమ్మదిగా, ఒకరి తర్వాత ఒకరు, కదిలారు.

అందరూ అక్కణ్ణించి వెళ్ళిపోయాక నెమ్మదిగా స్టాఫ్ రూంకేసి కదిలాను. అక్కడా యిదే చర్చ — దేశానికి ఎన్ని సమస్యలున్నాయో, ఎన్ని ప్రశ్న లున్నాయో నాకు సరిగా తెలీదు. యింత పెద్ద దేశంలో అల అణువంత ఉండే స్టాఫ్ రూంకు మాత్రం తలకు మించిన సమస్యలు, లెక్క లేనన్ని ప్రశ్నలు—ఇక్కడుండే అరడజను మందికీ ఒక గొప్ప నమ్మకము ఒకటుంది. ఈ దేశం అనుభవిస్తున్న 'మేధావుల దారిద్ర్యానికి' అంటే 'ఇంటలెక్చువల్ ఇన్సఫిషియెన్సీ'కి వాళ్లందరూ జవాబులట! దేశం ఎన్నో ఏళ్ల నుంచి ఎదుర్కొంటున్న జాతీయ,

అంతర్జాతీయ సమస్యలకన్నిటికీ వీళ్లు అరక్షణం ఆలోచించకుండా, ఆరు గురూ ఆరు ఉచిత సలహాలు పారేస్తారు. జాతీయ, అంతర్జాతీయ సంక్షోభాలకే కాక వీళ్ల దగ్గర రాష్ట్ర, జిల్లా, తాలూకా, గ్రామస్థాయి సమస్య కూడా పరిష్కారాలు, లేకపోతే పరిష్కార పథకాలూ ఉన్నాయి. నాకొక్కసారి అనిపిస్తుంటుంది వీళ్లనందర్నీ ఓ రోజుపాటు దేశ ప్రధానమంత్రికి సలహాదారులుగా నియమం చేస్తే, దేశంలో పరిస్థితి, అటో, ఇటో తేలిపోతుంది. వస్తే విప్లవం వస్తుంది, లేకపోతే ప్రశాంతత నెలకొంటుంది. అంతే!!

స్టాఫ్ రూంలోకి వెళ్లే సరికి, నన్ను చూశాక ప్రశాంతత నెలకొంది. ప్రశాంతత నెలకొన్న వెంటనే చర్చలు! కాబట్టి క్షణం సేపు ఆలోచించి నేనే ముందుగా మాట్లాడటం ప్రారంభించాను– ఆ మాట్లాడటం, ఏ ఒక్కర్నీ ఉద్దేశించి కాకుండా, అందర్నీ సమిష్టిగా ఉద్దేశించినట్లుగా భావం వచ్చేటట్లుగా మొదలెట్టాను. 'మనం అంతా చదువుకొన్న వాళ్లం' అందరూ తెల్లపోయి చూశారు.

ఈ సారి తెల్లపోవటం నా వంతయింది. నిజమే వీళ్లను కలుపుతూ మనం 'మనం అంతా చదువుకొన్న వాళ్లం' అని అనటం తెలివితక్కువ పనే! నన్ను నేనే సవరించుకొంటూ అన్నాను– 'మనలో చాలమంది చదువుకొన్న వాళ్లం! కానీ, మన బయట, మనలో ఒకరిమీద యింత అసహ్యంగా, కారు కూతలు రాసుకోవటం చాలా అమానుషమైన సంగతి. ఈ సంగతి మనం అంతా ఎంతో తేలికగా ఏమీ జరగనట్లుగా, నిర్లిప్తంగా పట్టించుకోకుండా కూర్చోవటం ఇంకా ఘోరం.'

ఆరుగురు మేధావుల్లో ఒకతను అన్నాడు. 'మనమేం చెయ్యగలం రావు గారూ! ఇది వాళ్ల పర్సనల్ విషయం!'

'పర్సనల్ విషయం అని మనం అంతా చేతులు ముడుచుకొని కూర్చొని ఉంటే బాగుండేది. కానీ ఆ గోడలమీద రాతలేమిటి?'

'అంటే మేం రాశామనా ?'

'లేకపోతే మేం రాయించామనా మీ ఊహ ?'

నన్ను నేను నిగ్రహించుకొంటూ అన్నాను 'ఆ గోడలమీద అస హ్యపు రాతలు మీరు రాశారనీ, మీరే రాయించారనీ నేననలేదు. అది నా ఉద్దేశమూ కాదు! కానీ నా బాధంతా ఏమిటంటే మనలో ఒకరికి జరుగుతున్న ఈ అన్యాయానికి మనం అంతా ఇంత నిశ్శబ్దంగా, కేవలం ప్రేక్షకులుగా నిలబడిపోయామనే! ఒక్కరంటే ఒక్కరుకూడా నోరెత్తు కుని ఎదురు తిరగకపోవడంకన్నా అన్యాయం మనం ఇంకేమీ చేయలేము. ఇంతగా ఒకరి వ్యక్తిత్వాన్ని చంపే ప్రయత్నం జరుగుతోంటే, మనం చూస్తూ ఊరుకుండి పోవటం ఏమీ బాగలేదు'

'ఏం చేద్దామంటారు ?' ఒకతను అన్నాడు.

'మనం ఏం చేసినా, తప్పేనని నా ఊహ! ఎందుకంటే వారిద్దరూ ఈ విషయాన్ని పరిష్కరించుకోవాలేగానీ, మనం చేసేది ఏమీలేదు!

'అదీ నిజమే ఇంకొకరి కుటుంబ విషయాల్లో జోక్యం కలిగించు కోవటం దురాక్రమణే అవుతుంది!'

అంతర్జాతీయ వేత్త వ్యాఖ్య ఇది.

'ఒక విషయం, రావుగారూ, అంజనాదేవీ, విజయ్‌గార్ల విషయం గోడల మీద కెక్కడం బాధాకరమైన సంగతే కాదు. కానీ ఈ విష యంలో మనం ఏం చెయ్యగలమో నా కర్థం కావటం లేదు.'

'గోడల మీద ఎక్కడం అంటే తెలికటోయ్ రాజూ! చరిత్రలో సువర్ణాక్షరాలతో రాసినట్లే లెక్క!' వేళాకోళంగా అన్నాడు ఇంకొకతను.

నాకు ఒంటిమీద తేళ్లూ జెర్రులూ పాకినట్లయింది. వీళ్ళతో ఏ విషయం గురించి మాట్లాడినా అది నా తెలివి లేమిని సూచిస్తుందేగానీ ఇంకేమీ కాదనిపించింది. ఆ మనుషులున్న అడివిలోంచి నెమ్మదిగా

'చెప్పనా ? – పెళ్ళయి యింతకాలం అయిందా – మన్ని మున్నాట వరకూ యింట్లో ఆయన తమ్ముడో, చెల్లెలో, ఎవరో ఒకరు ఉంటానే

బయటకు నడిచాను. కాలేజీ ప్యూన్‌ను పిలిపించి, వో రెండురూపాయ లిచ్చి, ఆ గోడల మీద సున్నం వెయ్యమని చెప్పాను.

కాలేజీ ఆవరణలోంచి బయటకొస్తోంటే ఆ రాతలు నన్ను తరుము తున్నట్లుగా అనిపించి, వెనక్కు తిరిగాను.

'సెపరేషన్ జిందాబాద్'

'అంజనా విజయ్‌ల మధ్య అగాధం' —

'సుఖసౌఖ్యాలకు విడిపోవడమే శ్రేయస్కరం.'

'ఎంతకాలం ? ఇంకెంతకాలం ?

—సంపాదిస్తూ బానిసత్వం ఇంకెంత కాలం ?'

ఇంకా నేను రాయలేనివి, చదవలేనివి ఎన్నో....

*　　*　　*　　*

సాయంత్రం వరకూ ముళ్ల మీద కూర్చున్నట్లుగా ఇంట్లో కూర్చు న్నాను. ఇంట్లో రగులుకున్న అగ్ని ఉంటే, సావకాశంగా విశ్రమించే తత్త్వం కాదు నాది.

కాలేజీ స్టాఫ్ యూనియన్ ప్రెసిడెంట్‌గా కాకపోయినా, ఒక బాధ్యతగల పెద్దమనిషిగా నా విధి నేను నిర్వర్తించ దలిచాను. అంజనా దేవిగారు, విజయ్ ఇద్దరూ నా కాలేజీలోనే లెక్చరర్స్. మంచి జోడీ అని నేనెంతగానో సంతోషించాను. మొదట్లో వాళ్లిద్దరూ ఇద్దరిదీ ఒకటే మనసు. ఒకటే శరీరం అనే విధంగా ఉండేవారు.

కానీ వాళ్ళిద్దరి మధ్యా ఇంతటి లోయలున్నాయనీ, వో అగ్ని పర్వతం మీద కూర్చున్నా కానీ, వారి గుండెల్లోనే లావా దాగుందనీ, అది యింత ఘోరంగా ఒకరోజు విజృంభిస్తుందని అనుకోలేకపోయాను.

నిజమే పైకి కనబడే మనిషికి, లోన దాగున్న మనసుకూ ఎంత దూర మోగదా !

సాయంత్రం విజయ్ వాళ్ల యింటికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి విజయ్ వసారాలో కూర్చొని పేపరు చదువుకొంటున్నాడు. మనిషిలో జీవకళ అన్నది ఎక్కడా కనబడ్డంలేదు. మనిషి పేలవంగా, జీవచ్ఛవంలా ఉన్నాడు. నన్ను చూసి పేలవంగా నవ్వాడు. నేనూ నవ్వలేకపోయాను.

కొంతసేపు అంతర్జాతీయ పరిస్థితి మీద మాట్లాడుకున్నాము. అది బొత్తిగా అధ్వాన్నంగా వుందనీ, జాతీయ రంగంలోనూ పరిస్థితి అంత సంతృప్తి కరంగా లేదనీ అనుకొన్నాము. ముందు ఇల్లు గెలిచి రచ్చ గెలవమన్నారు కానీ మేము ముందు రచ్చబండ రాజకీయాలు చర్చించి, తర్వాత కుటుంబ విషయాల్లోకి దిగాము—విజయ్ క్షణం సేపు శంకించాడు. చాలా డెలికేట్ పొజిషన్ అది, కాదనను. అందుకే నెమ్మదిగా నేనే మళ్లీ అన్నాను 'యిలా యింటి విషయాల్లో తల దూర్చకూడదనుకోండి! కానీ, చూస్తూ చూస్తూ ఊరుకోలేక.'

'నిజమేనండి—అంతా అంజు మూర్ఖత్వం, చేతులారా చేసుకొన్నది అనుభవించాలి కదండీ!' అంటూ ఆగాడు.

'మీరేమీ అనుకోకండి – అసలు యిద్దరికీ గొడవ ఎలా ప్రారంభమైంది?'

నవ్వాడు—'గొడవ! – యిది ఆర్థిక సమస్యరండి, నేనేదో తన్ని దోచుకు తినేస్తున్నాననే ఊహ ఏర్పడిపోయింది అంజులో....'

నేను ఉలిక్కి పడ్డాను – పెళ్ళి చేసుకుంటే ఒకర్నొకరు దోచుకు తినడానికేనన్న సంగతి నాకు తెలీందికాదు. కానీ నేననేది శారీరకంగా!– యిక్కడ 'ఆర్థికం'గా ఒకరినొకరు 'దోచుకు తినటం'. తమాషాగావుంది. కొత్తగా వుంది!

'అంటే నాకర్థం కావటంలేదు.'

'నిజమే, అసలు మొదట్లో నాకూ అర్థం కాలేదు. నన్ను 'దోపిడీ దొంగ'నంది. మొదట తన మనసూ, తర్వాత తన శరీరాన్నీ, ఆ తర్వాత

తన సంపాదననూ దోచుకు తినేశానంటోంది. యిద్దరం కలిస్తే, వెన్నె లలు విరుస్తాయన్నమాట! శరీరాలు కలుస్తే సుఖాలు పంచుకోగల మన్నమాట! యింతా చెప్పి, చివరకు తనకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా చేసి బానిసగా చేశానట! తన యింట్లో తను 'ద్వితీయ శ్రేణి పౌరుడి'లా గడుపుతోందట. తనదంతా దోచుకుతిన్నా, విశ్వాసం లేకుండా వుందట నాకు—యివండీ ఆరోపణలు!' అన్నాడు విజయ్.

ప్రజల జీవితాల్లో రాజకీయాలు ఎంతటి ప్రాముఖ్యాన్ని వహి స్తాయో అర్థం అవుతోంది నాకు. 'ఆర్థిక స్వాతంత్ర్యం', 'దోపిడీ', 'బానిస', 'ద్వితీయ శ్రేణి పౌరుడు'.... నాకు నవ్వొచ్చింది.

'ఇంతకీ ఆరోపణలు నిజమంటారా? కాదా?!'

'ఆరోపణలు అంటే ఆరోపణలు అనే అర్థం. అది నిజమైతే ఆరోపణలు అనరు కదండీ!.... ఊ, నిజమేనేమో ననిపిస్తోంది-ఇద్దరిలో ఒకరిది బానిస బ్రతుకయిపోయింది. కాదనను, అంజు అంటోంటే నాకూ తెలుస్తోంది—నేనెంతటి బానిస బ్రతుకు బ్రతుకుతున్నానో! నిజం చెప్పా లంటే యింట్లో ద్వితీయ శ్రేణిలో బతికేది, బతుకుతున్నదీ నేనే! ఆర్థిక అసమానత యింట్లో ఎంత ఘోరంగా తాండవ మాడుతోందని ఆలోచిస్తే మతిపోతోంది. అంజుకన్నా నేనెక్కువ సంపాదించేది ఎంత వాస్తవమో, యింట్లో నాది బానిస బతుకన్నదీ అంతే నిజం!'

నాకు ఆశ్చర్యంతో బాటుగా ఆవేదనా కలిగింది. 'భార్యా భర్తలలో యజమాని, బానిస అంటూ ఈ భేదాలేమిటండీ సిల్లీగా!'

'మొదట్లో సిల్లీగా అనిపించినా, యిది చాలా సీరియస్ ప్రాబ్లం అయిపోయింది రావుగారూ!'

నాకేమనాలో అర్థం కాలేదు—ఒక్క విజయ్ వాదనే వింటే నాలో పక్షపాత ధోరణికి పునాదులు పడతాయనే భావం కలిగి బయటకు నడిచాను.

ఇంటికి వచ్చేసరికి యింట్లో నాకోసం అంజనాదేవి కాచుకొనుంది. నన్ను చూసి నవ్వింది పలకరింపులాగ. క్షణం సేపు తర్వాత అంది అంజనాదేవి 'మీరు ఆయన దగ్గరకు వెళ్లొచ్చారటగా ?'

ఔనన్నాను.

'ఏమన్నా రేమిటి ?'

'ముందు మీరేమంటారో చెప్పండి !' నవ్వుతూ అన్నాను.

'అనడానికి ఏముందండీ ? యింతకాలం తర్వాతనైనా నాకు కను విప్పు కలిగినందుకు దేవుడికి థాంక్స్ చెప్పుకొన్నాను. యిన్నాళ్ళకైనా స్వేచ్ఛా వాయువులు పీల్చాలనే కోరిక కలిగింది నాకు. ఈ దోపిడీదారు నుంచి విముక్తి ఎంత త్వరగా లభిస్తే అంత మంచిదనిపిస్తోంది !' ఆగింది అంజనాదేవి.

అంజనాదేవి అంటున్న మాటలలో నిజం ఉందో లేదోగానీ, ఆవేశంవుంది; పట్టుదల వుంది; మొండితనం వుంది——

'అసలింతకూ ఏం జరిగిందండీ ?'

'ఏం జరిగిందని నెమ్మదిగా అడుగుతారేం ? నెల నెలా ఒకటో తారీఖు సంపాదించినదంతా తీసుకెళ్ళి ఆయన చేతుల్లో పోయటం–ఆయన అదంతా పేకాటలో తగలెయ్యటం–పేకాటలో పోగొట్టుకొనేది డబ్బేకదా అనే ఊహతో ఊరుకొన్నాను. పోయిన డబ్బును సంపాదించుకోవచ్చు గదా, సంపాదించుకోగలిగినంతకాలం తగలేసినా పర్వాలేదు అనే అనుకొనేదాన్ని యింతకాలం ! కానీ.... మనసుకు గాయం తగిలితే... భరించటం నావల్లకాదు——'

'ఏం జరిగింది ?'

'చెప్పనా ? – పెళ్ళయి యింతకాలం అయిందా–మొన్న మొన్నటి వరకూ యింట్లో ఆయన తమ్ముడో, చెల్లెలో, ఎవరో ఒకరు ఉంటూనే

వచ్చారు. నేనేమైనా అన్నానా ? అన్నిటినీ భరించాను. కానీ యిదిగో ఈ అవమానం - నావల్ల కాదు... అందుకే అంటున్నాను ఫ్రెండ్లీ సెపరేషన్...'

'ఏం జరిగింది అవమానం మీకు ?

'మీకీ సంగతి చెప్పి తీరాలి. కాదనను, మొన్న కాలేజీలో బోటనీ డిమాన్‌స్ట్రేటర్ ఖాళీ వచ్చిందిగదా - మా చెల్లెలు, కాంత, ఉంది గదా, మీరేదో అవస్థ పడి ఆ ఉద్యోగం యిప్పించండి అంటే ఆయన చేసిందేమిటో తెలుసుగా - తన తమ్ముడికి యిప్పించుకొన్నారు. తన తమ్ముడి గురించి చెప్పి వుండకపోతే, నా చెల్లెలికే వచ్చేదేమో ఈ ఉద్యోగం ! మనిషిలో యింత పక్షపాత ధోరణి, నెపోటిజమ్ - ఉండ కూడదు రావుగారూ ! మీకర్థంకాదు నేను అనుభవిస్తున్న ఈ మానసిక చిత్రహింస !'

అంజనాదేవి అన్నట్లుగా, నాకు నిజంగా అర్థంకాలేదు. వాళ్ళిద్దరి మధ్యా చెలరేగుతున్న ఈ గొడవ కేవలం ప్రణయ కలహమో, అంత ర్యుద్ధమో ! మొత్తంమీద వీళ్ళ యింట్లో మాత్రం విప్లవ ధోరణులు కానవస్తున్నాయి.

ఊళ్లో, ముఖ్యంగా ఆడవాళ్ళ, విప్లవం లేవదీయడం సమాజానికి ముఖ్యంగా మా మగవాళ్ళకు అంత ఆరోగ్యకరం కాదు. అందుకే ఎలా గైనాసరే, ఈ విప్లవాన్ని అణచివేయాలనే ధోరణి కలిగింది నాలో.

ఏమైనా చేయాలంటే సామదాన భేద దండోపాయాలని నాలుగు మార్గాలున్నాయన్న సంగతి నాకు తెలీందికాదు.

అందుకే ముందుగా యిద్దరి మధ్యా సామరస్యం సమకూర్చటానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నించాను. కానీ ఫలితం లేకపోయింది. ఆ తర్వాత దానం - అంటే యిద్దరి మధ్యా రాజీ కుదర్చటానికి కొన్ని

పథకాలు తయారు చేశాను—ప్రతి నెలా అంజనాదేవి జీతం యికముందు యింటికి ఖర్చుపెట్టటానికి వీల్లేదనీ, భార్యను భరించడం భర్త విధి కనుక, విజయ్ ఒక్కడే సంసార భారాన్ని మోయాలనీ, యింతకాలం అంజనాదేవి తన కుటుంబానికీ, విజయ్ తన కుటుంబానికీ చేసినంతగా, సాయం చేయలేక పోయింది గనుక, విజయ్ నెలకో వంద రూపాయలు అంజనాదేవికి గ్రాంట్‌లా ఇవ్వాలనీ అన్నాను నేను. అంజనాదేవి ఆనందంగా ఒప్పుకొంది. పై షరతులన్నీ న్యాయ సమ్మతంగా ఉన్నాయనీ, తనకు జరిగిన అన్యాయం ఎలాగైనా సరిదిద్దబడేది కాదనీ, అయినా పెద్ద మనిషిగా నేను కుదుస్తున్న ఒప్పందానికి తమ ఆమోదాన్ని తెలుపడానికి సిద్ధమేనంది అంజనాదేవి.

విజయ్ షరతులన్నీ విని నవ్వేడు—'ఇంతకాలం తన్ను నేను దోచుకొన్నానన్న మాట అబద్ధం గానీ, ఇకపై నన్ను తను దోచుకుంటుందన్న సంగతి మాత్రం నిజం! నా యిల్లు కొల్లగొట్టి, తన ఇల్లు నిలబెడతాననడం హాస్యాస్పదం—ఏమైనాసరే, ఈ దోపిడీని నేను అంగీకరించను.... పై పెచ్చు నెలకో వంద రూపాయలు గ్రాంటనే సంగతి మీ పక్షపాత వైఖరికి మంచి నిదర్శనం' అన్నాడు విజయ్.

విషయం మరీ కాంప్లికేటెడ్ అయిపోయింది. మొదట ఆర్థిక అసమానతలతో మొదలయి, ఆ తర్వాత ఉద్యోగావకాశాలతో పెరిగి, చివరకు గొడ్డళ్ళవరకూ వచ్చేసింది.

ఎలాగైనా విజయ్‌చేత షరతులను అంగీకరింప జేస్తానని అంజనాదేవికి మాట యిచ్చి, యిలా ఉత్త చేతులతో తిరిగి వెళ్ళి ఆవిడకు కనిపించటం భావ్యం కాదనిపించి, పై పెచ్చు కాలం గడిస్తే, కొంచెం ప్రశాంత వాతావరణం ఏర్పడితే ఆ తర్వాత చర్చలు కొనసాగించవచ్చుననుకొన్నాను.

ఆ తర్వాత రోజున కాలేజీకి వెళ్ళేసరికి కాలేజీ గోడలు మళ్ళీ అక్షరాలతో అలంకారాలు దిద్దుకొన్నాయి. క్రితంసారి అంజనాదేవి, విజయ్‌ల గురించే రాసివుంది కానీ ఈసారి ఆ యిద్దరిపేర్లతో పాటుగా నా పేరూ కొంత స్థలం సంపాదించుకో గలిగింది.

'అంజనాదేవి—విజయ్‌ల సమస్యకు రావుగారి రాజీప్రయత్నాలు'

'సమైక్య కుటుంబం వర్ధిల్లాలి'

'కలసివుంటే కలదు సుఖం, వేరు పడితే తీరని దుఃఖం'

'రావుగారి రాజీ, భార్యాజీ దోపిడీ..'

....ఇంకా ఎన్నో – ఈసారి నాకు ఆశ్చర్యమూ కలిగింది. నేను రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్లుగా, ఆ ప్రయత్నాలలో అంజనాదేవికి కొంచెం ప్రాముఖ్యత యిస్తున్నట్లూ ఈ గోడల కెలా తెలిసింది? ఈ గోడలమీద చరిత్రకారు లెవరోగానీ, వీరికి మంచి సీక్రెట్ సర్వీస్ కూడ ఉన్నట్లుంది.

నాలో పంతం పెరిగింది – ఎలాగైనా నా ప్రయత్నాలు ఫలించి తీరాలని, ఈసారి అంజనాదేవిని కలుసుకోవాలని నేను అనుకుంటుండగనే, ఆవిడే నాకోసం వచ్చింది.రావటం రావటం వరదలాగా, పెను తుఫానులాగా వచ్చింది. వచ్చి నన్ను నాలుగూ దులిపేసింది – 'మీ పెద్దలకు ఇదెక్కడి బుద్ధండీ? రాజీచేస్తామని వెళ్లి ఫెయిలయిపోతే నాకు చెప్పనక్కర్లేదా ఏం! పైపెచ్చు, ఇలా మా యిద్దర్నీ విడిపోనీకుండా మమ్మల్ని చిత్రవధ చేస్తారా? మా యిద్దర్నీ కలిసి ఉండమంటూ యిద్దరి మధ్యా మరి కొంత అగ్నిని పెంచి, తమాషా చూడాలనుకొంటున్నారా? మీ వెధవ బుద్ధులు పోనిచ్చుకొన్నారుకాదు.–మీలాంటివాళ్లు వందమంది మా ఇద్దర్నీ కలిసి ఉండమన్నా మేం నిర్ణయించుకొన్న తర్వాత మీరెవరు? కలిసి ఉన్నంతకాలం ఉన్నాం – ఇక విడిపో దలుచుకున్నాం! అంతే!! అటు

సూర్యుడు యిటు పొడిచినా, హరిహరాదులు అడ్డొచ్చినా మేం విడిపోయి తీరతాం !'

నా తల తిరిగి పోయింది.

ఇంట్లో ఏమీ తోచక, నా ప్రయత్నాలు ఇలా బెడిసిపోయాక, తల తిరిగి కాలేజీకి బయలుదేరాను. అక్కడ గోడలమీద మళ్లీ రాతలు మారిపోయాయి.... ఈసారి నేను తిన్న చీవాట్లూ, చెప్పుదెబ్బలూ గోడ మీద స్థలం చూసుకొన్నాయి.

'సెపరేషన్ జిందాబాద్—'

'మధ్యవర్తి ముర్దాబాద్....'

'రాజీ పథకం నశించాలి—'

'విడిపోవడం మా జన్మహక్కు....'

నాకు వళ్ళు మండిపోయింది.

క్షణం నన్ను నేను సంబాళించుకోలేక పోయాను – కాలేజీ ప్యూన్ బాలయ్యను పిలిపించాను. గోడలమీద రాసిన రాతల్లో నా పేరు వున్నదంతా చెరిపించాను. బ్రతకాలంటే, ఉన్న పేరు నిలబెట్టుకోవాలంటే రంగు మార్చక తప్పదనిపించింది.

సున్నం గోడమీద జేగురురంగు అక్షరాలు రాయించాను. 'సెపరేషన్ జిందాబాద్... సెపరేషన్ జిందాబాద్... సెపరేషన్ జిందాబాద్...'

విడిపోతామన్న యిద్దరిమధ్య నిలబడ్డ మధ్యవర్తి ఓడిపోక తప్పదనే సంగతి నాకొంచెం ఆలస్యంగా తెలిసింది.

నేడో రేపో – ఇంతకాలం కలిసిఉన్న భార్యాభర్తలు విడిపోయి... సుఖంగా కాలం గడుపుకొంటారనే సంగతి నిజం !!

సెపరేషన్ జిందాబాద్—

[ఆంధ్ర సచిత్ర వారపత్రిక 10–8–73]